క్లుప్తంగా

గ్రామ సభల్లో పనుల ఎంపిక

నింద్ర: పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పనులను ఎంపిక చేయాలని ఎంపీడీఓ అరుణ తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి పనులపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రజాభిప్రాయం మేరకు ఎంపిక చేసిన పనులు చేయాలన్నారు. జాబ్‌కార్డులున్న కుటుంబాలకు తప్పనిసరిగా ఉపాధి కల్పించాలని సూచించారు. ఏపీవో ఇందుమతి పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


అభ్యసనా సామగ్రి అందజేస్తున్న దాతలు

వెదురుకుప్పం: విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని హెచ్‌ఎం లీలావతి అన్నారు. మండలంలోని మత్రిపల్లెకు చెందిన అనిల్‌కుమార్, రమ్యకృష్ణ దంపతుల కుమారుడు నిశ్చల్ ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా దేవళంపేట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు అభ్యసనా సామగ్రిని ఉచితంగా అందజేశారు. అందరికీ ప్లేట్లు, గ్లాసులతోపాటు అభ్యసనా సామగ్రిని వితరణ చేసినట్లు హెచ్‌ఎం చెప్పారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం రేపు

నింద్ర: పంచాయతీలోని కాటేరి చెరువు, రెడ్డి గుంట, అయ్యారు గుంటలో చేపల పెంపకానికి సోమవారం వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ధరణీ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలం ఉంటుందని పేర్కొన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్లు బాధ్యతగా పని చేయాలి


మాట్లాడుతున్న డీఈ పద్మనాభపిళ్లై

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో షిఫ్ట్ ఆపరేటర్లు బాధ్యతగా పని చేయాలని డీఈ పద్మనాభపిళ్లై, పీఆర్ డీఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. మహదేవపురం సబ్‌స్టేషన్‌ను శనివారం వారు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు పొదుపుగా వాడాలని అవగాహన కల్పించాలన్నారు. రైతులకు 9 గంటల విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని సూచించారు. అక్రమ విద్యుత్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏడీఈలు బాబు, జ్ఞానేశ్వర్, ఏఈ వరద రాజు, లైన్‌మన్లు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు రైతులకు లాభదాయకం


ఆర్‌బీకేలో లబ్ధిదారుల జాబితాను పరిశీలిస్తున్న ఏఓ

పాలసముద్రం: సేంద్రియ సాగు వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. ఆముదాల రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని తెలిపారు. తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి, భూసార పరీక్షను బట్టి ఎరువులు వాడకం, అంతరపంటల సాగు వలన మిత్ర పురుగులను వృద్ధి చేయడం, రసాయనిక మందుల వాడకం తగ్గించడం వంటి అంశాలను వివరించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల, ఈ క్రాప్ బుకింగ్ జాబితాలను పరిశీలించారు.

మహిళల సంక్షేమమే జగనన్న కులం

- డిప్యూటీ సీఎం నారాయణ స్వామి
- జీడీనెల్లూరులో ఆసరా చెక్కు పంపిణీ


మెగా చెక్కును మహిళలకు అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధర నెల్లూరు: మహిళల సంక్షేమమే జగనన్న కులం, మతంగా భావించి పథకాలను అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. రాష్ట్రంలో డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ ఆసరా 4వ విడత కార్యక్రమాన్ని ఆయన మండల కేంద్రంలో శనివారం ప్రారంభించారు. అనంతరం పీడీ తులసి, ఎంపీపీ అనిత, ఏపీఎం చిరంజీవి, నాయకులు, మహిళలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండలంలోని 1,183 వేల డ్వాక్రా మహిళా గ్రూపులకు రూ. 1548.34 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి మహిళ సంక్షేమం, అభ్యున్నతే సీఎం జగనన్న కులం, మతం, ధ్యాస అన్నారు. జగనన్న అందిస్తున్న పథకాలు రాష్ట్రంలోని పేదింటి అక్కచెల్లెమ్మలకు వరాలుగా మారాయని చెప్పారు. ఇలాంటి సంక్షేమ పథకాలు మరెన్నో అందించాలంటే మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి ఓటేస్తే సంక్షేమ పథకాలు ఎక్కడికక్కడ ఆగిపోతాయన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. గతంలో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి అవినీతి అక్రమాలతోపాటు పెత్తనం సాగించిన విషయాన్ని గుర్తు చేశారు. నవరత్నాల ఫలాలు గడప గడపకూ చేరాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మళ్లీ రావాలని పేర్కొన్నారు. వలంటీర్ వాకిట్లోకి వచ్చి పింఛను ఇచ్చే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది, కేవలం జగనన్న ప్రభుత్వమేనని కొనియాడారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని వివరించారు. కోవిడ్ సమయంలో ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, పథకాలు ఎక్కడా ఆగలేదన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుధాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమ్మ రెడ్డి, రైతు భరోసా కేంద్రాల అధ్యక్షుడు బలరాం రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, స్థానిక సర్పంచ్ వీసీ సుబ్రహ్మణ్యం, మాజీ కన్వీనర్ సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేలు మొదలియార్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, ఎంపీటీసీ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి


మోహన్ రెడ్డి తల్లి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ

జీడీ నెల్లూరు మండలం పెద్ద కాల్వ పంచాయతీ చెర్లోపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మోహన్ రెడ్డి మాతృమూర్తి సరోజమ్మ శనివారం మృతి చెందారు. సమాచారమందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆ గ్రామానికి చేరుకొని సరోజమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్ద కాల్వ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఏకాంబరం, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, గుణశేఖర్ రెడ్డి, వేల్కూరు మాజీ సర్పంచ్ కుట్టి తదితరులు ఆయనతో ఉన్నారు

ఎస్టీయూ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న రాష్ట్ర,జిల్లా నాయకులు

నగరి: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నగరి మండలశాఖ నూతన కార్యవర్గం శనివారం ఏర్పాటైంది. డివిజన్ కేంద్రమైన నగరి పీసీఎన్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయవాణి ప్రధాన సంపాదకుడు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరగొండ హేమచంద్రా రెడ్డి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి కలికిరి పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. గత మండల కమిటీకి పదవీకాలం ముగియడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ గౌరవాధ్యక్షుడిగా త్యాగరాజులు రెడ్డి, అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఊత్తుకోట రాజశేఖర్, ఆర్థిక కార్యదర్శిగా నారాయణస్వామి, సహాధ్యక్షుడిగా రమేష్, అదనపు ప్రధాన కార్యదర్శులుగా రామనాథకుమార్, సురేష్,హేమంత్ కుమార్, మల్లికార్జున్, ఉపాధ్యక్షులుగా మోహన్ రామ్, బాబు, విజయసంధ్య, వెంకటేశులు, వై.రమేష్. కార్యదర్శులుగా రవిశేఖర్, సుబ్రమణ్యం, నాదముని, సీపీఎస్ కన్వీనర్‌గా లోకేష్‌ను ఎన్నుకున్నారు. అలాగే

మహిళా కార్యదర్శులుగా లలిత, వనజ, మహిళా కన్వీనర్లు పల్లుగ, శోభ, మైనారిటీ కన్వీనర్ అయ్యప్పన్, జిల్లా కౌన్సిలర్లుగా కలికిరి పవన్ కుమార్ రెడ్డి, గంగామోహన్, గిరిబాబు, నాగభూషణం, మహేంద్రన్, మోహన్, టిఎం .సుబ్రమణ్యం, శివశంకర్, గణేశన్, అక్బర్, శ్రీదేవి, సుమతి, రవిశంకర్, మణిని ఎన్నికున్నారు.

రాగి జావతో మంచి ఆరోగ్యం


విద్యార్థులకు రాగిజావ పంపిణీని పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న రాగి జావతో విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని ఆముదాల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు ఇస్తున్న రాగి జావను రుచి చూశారు. జగనన్న గోరుముద్ద పథకంలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తాజా కూరగాయలు, అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం స్వీకరించారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ


రోడ్డు పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నగరి: గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వం రోడ్లను నిర్మిస్తోంది. మండలంలోని దామరపాకం, టీవీ కండ్రిగ గ్రామాల్లో రూ. 5.20 లక్షల వ్యయంతో 135 మీటర్లు మేర నిర్మించే సిమెంటు రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రజలు ఎన్నో ఏళ్లపాటుగా ఎదురుచూస్తున్న రోడ్డు నేడు మంత్రి ఆర్కేరోజా చొరవతో సాకారమైంది. రోడ్డు పనులను స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులు దగ్గరుండి పరిశీలించాయి. పార్టీ నాయకులు అరుణాచలం రెడ్డి, గణపతి శెట్టి, హరిరెడ్డి, చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, గురుమూర్తి, షణ్ముగ రెడ్డి, సర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు. రోడ్డు వేసి సమస్యను పరిష్కరిస్తున్నందుకు స్థానిక ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.


థామస్ విమర్శలు హాస్యాస్పదం

వెదురుకుప్పం: కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని థామస్ డిప్యూటీ సీఎంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం అన్నారు. శనివారం ఆయన వెదురుకుప్పంలో విలేకరులతో మాట్లాడుతూ ఇంకోసారి ఉప ముఖ్యమంత్రిపై నోరు పారేసుకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇన్‌చార్జి పదవి కోసం రూ కోట్లు సమర్పించుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి థామస్, నిస్వార్థంగా సేవలందిస్తున్న డిప్యూటీ సీఎంపై విమర్శలు చేయడం హేయం అని అన్నారు. రాజకీయాలలో కొత్తబిచ్చగాడైన థామస్ ప్రచారాల కోసం రూ.100 ఇచ్చి ఫొటోలు తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

టైలరింగ్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

పుత్తూరు: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో స్వయం ఉపాధి కోసం టైలరింగ్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులు రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌సీ పాస్, ఏదైనా డిగ్రీ కలిగిన యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30వ తేదీ లోపు కళాశాలలోని స్కిల్ హబ్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం అభ్యర్థులు ఆధార్ కార్డు, మార్క్స్ లిస్టు జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలని చెప్పారు. శిక్షణ పొందిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 63009 54441 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



నారాయణవనం: టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఊంజల్ సేవ నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం కైంకర్యాలు పూర్తి అయిన అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా కొలువుదీర్చి తిరుచ్చి వాహనంపై అధిష్ఠింప జేసి ఊంజల్ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం గంట పాటు ఊయ్యాల సేవలో సేదతీరుతున్న ఉత్సవ మూర్తులను భక్తులు వీక్షించి తరించారు.. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



బుచ్చినాయుడుకండ్రిగ: కనమనంబేడు గ్రామంలో మినుము పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణపై రైతులకు శనివారం మండల వ్యవసాయాధికారి భారతి అవగాహన కల్పించారు. మినుము పంటలో పల్లాకు తెగులుపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. లేత ఆకులో పసుపు రంగు మచ్చలు ఏర్పడి మొక్కలు ఎండి పోతాయని, తెగులు నివారణకు అసిఫేట్ గ్రాము, లేదా మోనోక్రోటోపాస్ 16 మిల్లీలీటరు నీటిలో పిచికారీ చేయాలని తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు, నగరిలో పార్కుల నిర్మాణం


పుత్తూరులో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి రోజా

- పుత్తూరులో ప్రహరీగోడ నిర్మాణానికి భూమి పూజ
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: అందరి ఆనందం..ఆరోగ్యం కోసం నగరి నియోజకవర్గంలో పలు ఉద్యా నవనాలు నిర్మిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. శనివారం పుత్తూరు పట్టణం 23వ వార్డులోని చింతల గుంటలో చిల్డ్రన్ పార్క్ స్థలంలో రూ.24 లక్షలతో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మంత్రి రోజా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుత్తూరులో త్వరలోనే చిల్డ్రన్స్ పార్కు నిర్మాణం ప్రారంభం కానుందని, అందులో భాగంగానే కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. పుత్తూరులో ఇదివరకే రూ.1.10 కోట్లతో వైఎస్సార్ మున్సిపల్ పార్కును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వడమాలపేటలో పద్మావతి ఉద్యానవనాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. వచ్చే ఫిబ్రవరి 10న నగరిలోనూ మున్సిపల్ పార్కును ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మంత్రి రోజాను గజమాలతో సత్కరించారు. అనంతరం మరమ్మతులకు గురైన స్థానిక పంచాయతీ రాజ్ అతిథి గృహాన్ని మంత్రి పరిశీలించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏఎల్‌ఎస్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్, సింగిల్ విండో ప్రెసిడెంట్లు శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, కౌన్సిలర్లు ఏకాంబరం, నరసింహరావ్, జానకెనడీ, చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, లారీమోహన్, రమేష్‌బాబు, మోహన్‌రెడ్డి, ఇందుమతి, మునయ్య, గాంధీ, బుజ్జీ, గోపి పాల్గొన్నారు.

పెనుమూరులో వికసిత్ భారత్


మాట్లాడుతున్న ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఎంతో దోహదపడుతుందని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిప్పారపల్లి, గుడ్యాణపల్లి గ్రామంలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక అసమానతలను తొలగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమాలను గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంక్షేమ పథకాలను వీడియో ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసమ్మ, ఉప సర్పంచ్ దూదిమునేంద్ర, గుత్తా వాసుదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషన్స్ డే


పుత్తూరు: ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్స్


నగరి : సంబరాల్లో అసోసియేషన్ సభ్యులు

నగరి: థామస్‌ఆల్వా ఎడిషన్ బల్బు కనుగొన్న రోజును పురస్కరించుకుని నగరి ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఎలక్ట్రీషియన్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. థామస్‌ఆల్వా ఎడిషన్‌కు జోహార్ చెబుతూ కేక్ కత్తిరించి సంబరాలు చేసుకున్నారు. అసోసియేషన్ ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎస్‌సీ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదభరితమైన వృత్తి కొనసాగుతున్న ఎవరికి ఏ అపాయం వచ్చినా అసోసియేషన్ అండగా నిలుస్తోందని తెలిపారు. మండపం ప్రాంతంలో, దేశమ్మ దేవాలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. సంఘ కార్యదర్శి ఇంద్రయ్య, ట్రెజరర్ దామోదరం, సభ్యులు రవి, కుమార్, బాషా, ఈశ్వరన్, మురళి, ప్రభు, నీలకంఠన్, వెంకటముని పాల్గొన్నారు.

పుత్తూరు: పట్టణంలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఎలక్ట్రీషన్స్ డే ఘనంగా నిర్వహించారు. స్థానిక ధర్మరాజుల ఆలయ ఆవరణలో జరిగిన సమావేశంలో సొసైటీ ప్రెసిడెంట్ కె.చిట్టిబాబు మాట్లాడుతూ శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిషన్ 1880 జనవరి 27న బల్బ్‌ను కనుగొన్నారని, అప్పటి నుంచి ఏటా జనవరి 27న ఎలక్ట్రీషియన్స్ డేను నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. అపాయకరమైన వృత్తిలో కొనసాగుతున్న కార్మికులందరూ విధిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సొసైటీ వైస్ ప్రెసిడెంట్ వి.బాలమురళి,సెక్రెటరీ రమేష్, జాయింట్ సెక్రెటరీ గోవిందరాజులు, ట్రెజరర్ జయరాం, సభ్యులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం: అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆశా నోడల్ ఆఫీసర్ సునీల ఆధ్వర్యంలో అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మోహన్ కృష్ణ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తిచెంది కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధకాలు, మెదడు వాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపరవైజర్ మురళి, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

తప్పిపోయిన చెన్నై వాసులు సురక్షితం

నాగలాపురం: మండలంలోని భూపతీశ్వరకోన జలపాతం వద్దకు విహార యాత్రకు వచ్చి దారి తప్పిన చెన్నై వాసులను పోలీసులు రక్షించారు. చెన్నై ఆవడికి చెందిన ఐదుగురు స్నేహితులు శుక్రవారం విహారయాత్రకు వచ్చారు. అటవీ ప్రాంతంలో ఉన్న కోనలోకి వెళ్లి దారి తెలియక తప్పిపోయారు. వెంటనే డైల్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఎస్‌ఐ టి.ఓబయ్య సిబ్బందితో అడవిలోకి వెళ్లి రాత్రి ఒంటి గంట వరకు గాలించి యువకులను రక్షించారు. దారి తప్పిన వారిలో నలుగురు యువకులతో పాటు ఒక యువతి ఉంది. వారిని సురక్షితంగా ఇంటికి పంపారు.

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్ర పోటీలు

గంగాధర నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గస్థాయి పోటీలు రెండవ రోజు అట్టహాసంగా సాగాయి. నియోజకవర్గ కేంద్రంలోని గంగాధర నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి పోటీలను మండల వైస్ ఎంపీపీ హరిబాబుతో కలిసి గంగాధర నెల్లూరు గ్రామ సర్పంచ్ బీసీ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల్లో క్రీడల పట్ల దాగివున్న ప్రతిభా పాటవాల్లను వెలికి తీయడానికి మట్టిలోని మాణిక్యాలను వెలికి తెచ్చేందుకు గొప్ప వేదిక ఆడుదాం ఆంధ్ర పోటీలు అని అన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్లు నియోజకవర్గస్థాయిలో తమ అత్యంత ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయి ఆపై రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి పోటీల్లో కూడా వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేరును విస్తరింపజేయాలని ఆకాంక్షించారు. ఈ క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి భారీ పారితోషికాలతో పాటు జాతీయ జట్టులో రాణించడానికి గొప్ప మార్గం అని చెప్పారు.

కబడ్డీ విజేతలు

కబడ్డీ పురుషుల విభాగంలో ఫైనల్స్ మ్యాచ్‌లో పాలసముద్రం, గంగాధరనెల్లూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. పాలసముద్రం జట్టు విజేతగా నిలిచి జిల్లా స్థాయికి అర్హత సాధించింది. కార్వేటినగరం జట్టు మూడవ స్థానం సాధించింది. మహిళా విభాగంలో శ్రీ రంగరాజపురం జట్టు మొదటి స్థానంలో గెలిచి జిల్లా స్థాయికి చేరుకుంది. రెండవ స్థానంలో కార్వేటి నగరం, మూడవ స్థానంలో పాలసముద్రం జట్టు నిలిచాయి.

బ్యాడ్మింటన్ విజేతలు

బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో వెదురుకుప్పం మొదటి స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు సాధించింది. రెండవ స్థానంలో కార్వేటినగరం, మూడవ స్థానంలో పెనుమూరు జట్లు నిలిచాయి. మహిళా విభాగంలో పెనుమూరు మొదటి స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించగా వెదురుకుప్పం రెండవ స్థానం, కార్వేటినగరం మూడవ స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్, సర్పంచులు గంగయ్య యాదవ్, ఆడుదాం ఆంధ్ర పోటీల ప్రత్యేక వ్యాయామ ఉపాధ్యాయులు సెల్వ పాండియన్, ఆరు మండలాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు


కబడ్డీ ఆడుతున్న మహిళా క్రీడాకారులు


హోరాహోరీగా కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


కబడ్డీ మహిళా విజేత శ్రీరంగరాజపురం జట్టు


కబడ్డీ పురుషుల విజేత పాలసముద్రం జట్టు